ప్రజాశక్తి
శనివారం 30 సెప్టెంబర్ 2023 5
పార్వతీపురం మన్యం

స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ స్కాలర్ షిప్ ఎన్ఎంఎంఎస్ 2023 సంవత్సరానికి ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్లో వివరాలు నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పి 2.0)లో తమ వివరాలను తప్పుల్లేకుండా మెరిట్ కార్డుపై ముద్రించిన విధంగా, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్‌లో ఉండేలా పోర్టల్ (ఎన్ఎస్‌పి 2.0)లో నవంబర్ 30లోగా నమోదు చేయాలని తెలిపారు. సంబంధిత పాఠశాలల నోడల్ అధికారి డిసెంబర్ 15లోగా కుణ్ణంగా పరిశీలించి, వివరాలు నమోదు తీరు చూడాలని తెలిపారు. నమోదు చేసిన అప్లికేషను ప్రింట్ తీసి దానితో పాటు స్టడీ సర్టిఫికేట్, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికేట్, కుల ధ్రువీకరణ సర్టిఫికేట్, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ జతపరచి డిఇఒ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఆ నలుగురిలో ఎవరో?

- వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు
- నేడు పార్టీ విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - సాలూరు

అధికారపార్టీ తరపున రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులెవరనే చర్చ అప్పుడే మొదలైంది. కొద్దిరోజుల క్రితం సిఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు పుట్టించే పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల అమరావతిలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో సిఎం జగన్ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. సాధారణ ఎన్నికలకు ఇంకా ఆరునెలల గడువు ఉందని, ఇప్పుడున్న ఎమ్మెల్యేల్లో కొంతమందికి సీట్లు దక్కకపోవచ్చని స్పష్టంగా చెప్పారు. టికెట్లు దక్కని వారు బాధపడొద్దని హితవు పలికారు. పార్టీ, ప్రభుత్వ నిఘా సంస్థల సర్వే నివేదికల ఆధారంగా టికెట్ల కేటాయింపు జరుగుతుందనే సంకేతాలను ఇప్పటికే అనేక సార్లు ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉంది. సిఎం జగన్ చేసిన వ్యాఖ్యలు సిటింగ్ ఎమ్మెల్యే ల్లో ఆందోళన రేకెత్తిస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో మూడు ఎస్టీ, ఒక ఎస్సీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నాలుగు స్థానాలు వైసిపి అధీనంలో ఉన్నాయి. గత ఎన్నికల్లో వైసిపి భారీ ఆధిక్యంతో విజయం సాధించింది. అయితే త్వరలో జరుగనున్న ఎన్నికల్లో వైసిపి ఇప్పుడున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలం దరికీ టికెట్లు దక్కుతాయా, లేదా చర్చ జరుగుతోంది. డిప్యూటీ సిఎం రాజన్నదొర ఇప్పటికే హ్యాట్రిక్ విజయం సాధించారు. రాబోయే ఎన్నికల్లోనూ వైసిపి తరపున ఆయనే పోటీ చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈసారి అరుకు ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. అనేక సందర్భాల్లో ఆయన కోరికను వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లోనూ ఎంపీగా పోటీ చేయాలని భావించినా నియోజకవర్గంలో ఉన్న ఆయన అనుచరులు అంగీకరించలేదు. ఈసారైనా ఆయన కోరికను పార్టీ అధిష్టానం నెరవేరుస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకమే. రానున్న ఎన్నికలు వైసిపికి అత్యంత కీలకమైనవి కావడంతో సీనియర్ అయిన రాజన్నదొరను మళ్లీ ఎమ్మెల్యే గానే పోటీ చేయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, ఎమ్మెల్యేగా నియోజకవర్గ, జిల్లా రాజకీయాల్లో ఆయన పనితీరు పై నిఘా సంస్థలు, పార్టీ అంతర్గత సర్వే నివేదికల ఆధారంగా సీటు కేటాయించే అవకాశం ఉంది. మన్యం జిల్లా బాస్‌గా తన నియోజకవర్గంతో పాటు ఇతర నియోజకవర్గాలపై ఆయన ఏ మేరకు ప్రభావం చూపించారనే అంశం కూడా పరిగణనలోకి తీసుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ తెరపైకి వస్తోంది. ప్రతిపక్ష పార్టీలో నెలకొన్న గ్రూపు రాజకీయాలు రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపులో కీలకపాత్ర పోషిస్తాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సిటింగ్ ఎమ్మెల్యే రాజన్నదొరే సరైన అభ్యర్థి అవుతారనే వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.

నేడు వైసిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పార్వతీపురంమన్యం జిల్లా వైసిపి నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శనివారం పార్వతీపురం లయిన్స్ కల్యాణ మండపంలో జరుగుతుందని ఎంపిపి ఉరిటి రామారావు తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆధ్వర్యంలో జరుగు సమావేశానికి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ , రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ మేరకు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు సమావేశానికి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

పార్వతీపురం నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావుపై కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గడచిన ఐదేళ్లలో ఆయన నియోజకవర్గంలో వన్ మాన్ షో నిర్వహించారనే ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా నియోజకవర్గ కేంద్రం పరిధిలో శతి మించిన భూ కబ్జాలు, అవినీతి ఆరోపణలు అధికారపార్టీ గెలుపుపై కొంత ప్రతికూల ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే జోగారావు నాయకత్వంపై ద్వితీయ శ్రేణి నాయకుల్లో అసంతృప్తి కూడా నివురు కప్పిన నిప్పు లా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఎస్.జయమణితో పాటు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కూడా టికెట్ రేసులో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జిగా యువ నాయకుడు విజయచంద్రను రంగంలోకి దించడంతో అధికారపార్టీకి కొంత ఎదురీత తప్పకపోవచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి నియోజకవర్గంలోనూ అధికారపార్టీపై కొంత వ్యతిరేకత కనిపిస్తోంది. వరుసగా రెండుసార్లు గెలుపొందిన పుష్పశ్రీవాణి మూడోసారి విజయం సాధిస్తారా లేదా అనేది చర్చనీయాంశమైంది. పార్టీలో ఆమెకు ధీటుగా ఉండే మరో గిరిజన నాయకురాలు లేకపోవడం పుష్పశ్రీవాణికే అనుకూల పరిణామంగా కనిపిస్తోంది. నియోజకవర్గ టిడిపిలో నెలకొన్న గ్రూపు రాజకీయాలు ఇక్కడ కూడా వైసిపికి అనుకూలంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మాజీ డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్పశ్రీవాణిపై కొంత ప్రతికూల ప్రభావం ఉన్నప్పటికీ సీటు మాత్రం ఆమెనే వరించనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ అధిష్ఠానం వద్ద ఉన్న పలుకుబడితో టికెట్ సాధించుకుంటారనే వాదన పార్టీ వర్గాల నుంచి విన్పిస్తోంది. ఇక పాలకొండ నియోజకవర్గంలోనూ అధికార పార్టీకి కొంత ఎదురీత తప్పకపోవచ్చు. సిటింగ్ ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మధ్య కొంత గ్యాప్ వున్నట్లు తెలుస్తోంది. పాలవలస కుటుంబ ఆధిపత్యం అనేక ఏళ్లుగా కొనసాగుతోంది. ఎమ్మెల్యే కళావతి పాలవలస కుటుంబం కనుసన్నల్లో నడిచినంత కాలం ఆమె అభ్యర్థిత్వానికి ఢోకా ఉండే అవకాశం లేదు. అయితే ఇక్కడ కళావతికి పోటీగా మరో అభ్యర్థి తెరపైకి రావడంతో సరికొత్త చర్చ నడుస్తోంది. మాజీ మంత్రి పుష్పశ్రీవాణి చెల్లెలు పాముల సుజన పేరు గత కొద్ది నెలలుగా వినిపిస్తోంది. పార్టీ అధిష్ఠానం వద్ద పుష్పశ్రీవాణికి ఉన్న పలుకుబడితో తన సోదరి సుజనను తెరపైకి తీసుకొస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అధికారపార్టీలో నెలకొన్న గ్రూపు రాజకీయాల ప్రభావం ఆ పార్టీ విజయానికి ప్రతిబంధకం గా మారే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇక్కడ కూడా టిడిపిలో గ్రూపు రాజకీయాలు ఉండడంతో అవి వైసిపికి కొంత మేలు చేయొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో వైసిపికి మన్యం జిల్లాలో అభ్యర్థులెవరనే చర్చ మొదలైంది. సిఎం జగన్ చేసిన వ్యాఖ్యలు మన్యం జిల్లా లో ఏ సిటింగ్ ఎమ్మెల్యే పుట్టి ముంచినున్నాయో తేలాలంటే కొద్ది నెలలు వేచి చూడాల్సిందే మరి. అలాగే శనివారం జరగనున్న పార్టీ జిల్లా విస్తృత సమావేశం కూడా ప్రాచుర్యం నెలకొంది.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జెఎఎస్‌ను విజయవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్)ను విజయవంతం చేయాలనికలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శనివారం నుంచి ప్రారంభం కానున్న జెఎఎస్ వైద్య శిబిరాలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటి సర్వే పూర్తి కావాలని, ఒపి చీటీలు అందించాలని, వైద్య శిబిరం ఎక్కడ నిర్వహిస్తున్నదీ స్పష్టంగా తెలియజేయాలన్నారు. వైద్య అధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఎంపిడిఒలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. వాలంటీర్లతో కలిసి ముందస్తు నమూనా వైద్య శిబిరాలు నిర్వహించాలని, స్లాట్ లుగా విభజించి ప్రతి ఒక్కరికీ స్లాట్ ప్రకారం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసు షీట్స్ ముందుగా ప్రింట్ చేసి వాలంటీర్ వారీగా అందించాలన్నారు. శిబిరంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, లోటు పాట్లు ఉంటే వైద్య అధికారి భాధ్యత వహిస్తారని చెప్పారు. ఎంపిడిఒలు డేటా ఎంట్రీని పర్యవేక్షించాలని ఆదేశించారు. కంటి సమస్యలకు ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరం వద్ద హెల్ప్ డెస్క్ ఉండాలని, వైద్యులను కేటాయించే విభాగం, వైద్య పరీక్షల విభాగం తదితర అవసరమైన అన్ని విభాగాలు సైన్ బోర్డ్సుతో సహా ఉండాలనిఆదేశించారు. బిపి, హిమోగ్లోబిన్ ఇతర పరీక్షల వివరాలు ఇంటింటి సర్వే నిర్వహించిన అనంతరం కేసు షీట్స్‌లో నమోదు చేయాలని చెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆహార స్టాల్స్ పెట్టాలని, స్టాల్స్‌లో పెట్టే ఆహార పదార్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించి రక్త హీనత సమస్య బారిన పడకుండా చూడాలని ఆయన అన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు, నోడల్ అధికారి డాక్టర్ ఎం. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జెఎఎస్‌ను ప్రారంభించిన సిఎం

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్లతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా సిఎం ప్రారంభించారు. పేదలకు స్పెషలిస్ట్ వైద్యుల సేవలందించాలని, ఆరోగ్య ఆర్థిక ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని కార్యక్రమాన్ని చేపట్టామని విజయవంతం చేయాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.బి. వాగ్దేవి, మండల తనిఖీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

నేరాల అదుపునకు పటిష్ట చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో నేరాల అదుపుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పోలీస్ అధికారులను కోరారు. శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులతో తన కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాలులో ఆగష్టు మాసాంతపు నేర సమీక్షా సమావేశం నిర్వహించి, నమోదైన , దర్యాప్తులో ఉన్న తీవ్రమైన నేరాల కేసులను సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులు, ఎన్‌డిపిఎస్ కేసులు, ఐటి యాక్ట్ కేసులు, మహిళలపై జరిగే అన్యాయాలు, ప్రాపర్టీ దొంగతనాలు వంటి కేసుల గురించిన వివరాలు, రిజన్‌వైజ్‌గా విశ్లేషించి వాటి దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది, ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమీక్ష నిర్వహించి తగు నిర్దేశాలు జారీచేశారు. రోడ్డు ప్రమాదాల జరిగిన తర్వాత ఫారం-1, 5,7లను నింపి సంబధిత పత్రాలను జతచేసి (ఐరాడ్ యాప్) అప్ లోడ్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, రోడ్డు భద్రతా నియమాలపై వినూత్న రీతిలో అవగాహన కల్పించి వాహన తనిఖీలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలని, ఎంవి నిబంధనలు అతిక్రమించిన వారిపై చలానాలు విధించాలని, బైకు, ఇళ్ల దొంగతనాలు జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని, అక్రమ మద్యం అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలపై దృష్టి సారించి అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. 174 సిఆర్‌పిసి కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు జరిపాలని, అదృశ్యం కేసుల్లో దర్యాప్తు చేసి, తప్పిపోయిన వారిని ట్రేస్ చేయాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి సంబంధిత కోర్టులో ఛార్జ్ షీట్లను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు డిస్పోజల్ చేయడంలో మెరుగైన కృషి చేసినందుకు గానూ పార్వతీపురం టౌన్ పిఎస్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఎం.రామారావు, పార్వతీపురం రూరల్ పిఎస్‌కు చెందిన ఎస్.దామోదరరావు, సాలూరు టౌన్ పిఎస్‌కు చెందిన ఎస్.పురుషోత్తంనాయుడుకు ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో డిఎస్‌పిలు ఎస్.ఆర్.హర్షిత, జివి కృష్ణారావు, జి.మురళీధర్, సిఐలు సిహెచ్.లక్ష్మణరావు, ఎన్‌వి ప్రభాకర రావు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులు కాంట్రాక్టరుగా ఉండొచ్చా?

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ చైర్ పర్సన్‌గా వుండే వ్యక్తుల కుటుంబ సభ్యులు అదే మున్సిపాలిటీలో కాంట్రాక్టరుగా పనులు చేయకూడదనే నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ఇతర కాంట్రాక్టర్ల లైసెన్స్ పేరు మీద చైర్మన్ కుటుంబ సభ్యులు పనులు చేసిన దాఖలాలు ఉన్నాయి. కానీ ఇక్కడ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ కుమారుడు పిపిఎస్ భరత్ కుమార్ యజమానిగా వున్న వైభవ్‌శ్రీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరు తో కాంట్రాక్టు పనులు ఎలా చేయడానికి అధికారులు అనుమతి ఇస్తున్నారనే ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇటీవల ఆజాదీకా అమృత ఉత్సవాల్లో భాగంగా ఆగష్టు 15న మున్సిపల్ కార్యాలయంతో పట్టణంలోని ప్రముఖ ప్రదేశాలను ఎల్ఇడి విద్యుత్ దీపాలతో అలంకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిలో భాగంగా చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ కుమారుడు పిపిఎస్ భరత్ కుమార్ యజమానిగా వున్న వైభవ్ శ్రీ కన్ స్ట్రక్షన్ కంపెనీకి నామినేషన్ పద్ధతిలో విద్యుదీకరణ కాంట్రాక్టును అధికారులు అప్పగించారు. దీనికి లక్ష రూపాయల వరకు అంచనాతో అధికారులు బిల్లు ని ప్రతిపాదించారు. ఈ నెల30న మున్సిపల్ సమావేశం అజెండాలో మొదటి అంశంగా ఈ బిల్లు ఆమోదం కోసం పొందు పరిచారు. గతంలో కూడా ఇదే కంపెనీ పేరుతో పట్టణంలో కొన్ని పనులు జరిగాయి. అధికారపార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లే దీనిపై పెదవి విరుస్తున్నారు. రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో గత నెల మున్సిపల్ సమావేశం నిర్వహించలేదు. గడచిన ఆరునెలలుగా మున్సిపల్ సమావేశం అజెండాలలో పట్టణ సమస్యలకు సంబంధించిన అంశాలు వుండడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో విద్యుత్ దీపాల అలంకరణ అంశంపై కౌన్సిల్‌లో వాడివేడిగా చర్చించే అవకాశం ఉంది.

జిపిఎస్ ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి - పాలకొండ

ఉద్యోగులకు, ఉపాధ్యా యులకు గుదుబండగా మారిన జిపిఎస్ ప్రతులను స్థానికమండల వనరుల కేంద్రం పాలకొండలో ఎపి సిపిఎస్ఇఎ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుక్రవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎపి సిపిఎస్ఇఎ జోనల్ కన్వీనర్ కె.అప్పల నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అధికారంలోకి రాగానే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తానని చెప్పి ఈరోజు జిపిఎస్‌ను తీసుకురావడం ఉద్యోగులను మోసగించడమే నన్నారు. సిఎం తాను ఇచ్చి మాట నిలబెట్టుకో వాలని, లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, ఎపిటిఎఫ్, ఎస్‌టియు, పిఆర్‌టియు నాయకులు బి.వి.రమణ, జి.సూర్యనారాయణ, ఎస్.వాసుదేవరావు, పి.హేమనికుమర్, పి.నందియ్య, ఎం.జయప్రదం, ఎ.నాగరాజు, ఎం.ఉపేంద్ర, ఎ.రాంబాబు, జి.రాంబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

జిపిఎస్ ప్రతులను దగ్ధం చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

పాలకొండలో సైకిల్‌యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సాలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అక్టోబర్ 2నుంచి 11 వరకు నిర్వహించనున్న సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.పండు కోరారు. శనివారం దీనికి సంబంధించిన గోడపత్రికలను ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులతో కలిసి ఆయన పట్టణంలోని బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యా విధానం వైపు ప్రభుత్వాలు నడిపిస్తున్నాయని చెప్పారు. మోడీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేసే దిశగా అడుగులు వేస్తుందని విమర్శించారు. ఈ విధానాలపై విద్యార్థులను చైతన్యం కలిగించేలా జిల్లాలోని 15మండలాల్లో 400కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో డైట్ ఛార్జీలు, బిల్లులు మంజూరు చేయాలని, ఎఎన్ఎంలను నియమించాలని, ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ యాత్ర పార్వతీపురం చేరుతుందని తెలిపారు. అక్టోబర్ 11న పార్వతీపురం పట్టణానికి చేరుతుందని చెప్పారు. సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని పండు కోరారు. కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పాల్గొన్నారు.

పాలకొండ : సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాత్రకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ మాట్లాడుతూ సాలూరు, పోస్టుమెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టల్‌కు రోడ్డు సౌకర్యం, ఆశ్రమ పాఠశాల నిర్మించాలని, సీతానగరం, బలిజిపేట, మక్కువలో పోస్టుమెట్రిక్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, జూనియర్ కాలేజీల్లేని మండలాల్లో కాలేజీలు ఏర్పాటు చేయాలని, వీరఘట్టంలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని, పాలకొండ గిరిజన పోస్ట్ మెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టలుకు సొంత భవనం నిర్మించాలని, డిగ్రీ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని, సీతంపేటలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, పూతికవలసలో ప్రాథమిక పాఠశాలను నిర్మించాలని తదితర సమస్యలపై ఈ యాత్రను తలపెట్టిన తెలిపారు. ఈ యాత్రలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె. భాస్కర్, విద్యార్థులు ఎం.శివ, జి.శంకరావు, కె.కృపానందం, పి.అఖిల్, కె.రోహిత్, వి.నాగరాజు, ఆర్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

5న చలో స్టీల్‌ప్లాంట్ బహిరంగ సభ

ప్రజాశక్తి - బెలగాం

విశాఖ ఉక్కు రక్షణకై అక్టోబర్ 5న చలో స్టీల్ ప్లాంట్ బహిరంగ సభకు జిల్లా ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనంలో విశాఖ ఉక్కు రక్షణకై చలో స్టీల్ ప్లాంట్ బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగా 32 మంది ప్రాణ త్యాగంతో పోరాడి సాధించుకున్నందన్నారు. అలాంటి విశాఖ ఉక్కును బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరించి ఉత్తరాంధ్రకి తీవ్ర అన్యాయం చేయాలని చూస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఇప్పటికే 950 రోజులుగా దీక్షా శిబిరాలు కొనసాగుతున్నాయని, ఈ పోరాటానికి మద్దతుగా సిపిఎం ఉత్తరాంధ్ర వ్యాప్తంగా బైక్ యాత్ర చేపట్టిందన్నారు. ముగింపుగా విశాఖ స్టీల్ ప్లాంట్ దగ్గర కూర్మంపాలెంలో అక్టోబర్ 5న సాయంత్రం 4గంటలకు బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగసభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రధాన వక్తగా పాల్గొంటారన్నారు. కావున ప్రజలంతా ఈ బహిరంగ సభల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్ల వెంకటరమణ, కె.రామస్వామి, రెడ్డి శ్రీదేవి పాల్గొన్నారు.

కొమరాడ : విశాఖ ఉక్కు పరిశ్రమ రక్షణకు అక్టోబర్ 5న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు వి.ఇందిరా పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అక్టోబర్ 5న విశాఖ స్టీల్ ప్లాంట్ ఆర్చి కూర్మం పాలెం వద్ద 4 గంటలకు బహిరంగ సభ ఉందని, కావున ఈ బహిరంగ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమ ంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

వాహనమిత్ర ఆర్థిక సాయం రూ.4.56 కోట్లు

ప్రజాశక్తి - బెలగాం

వైఎస్ఆర్ వాహనమిత్ర ఆర్థిక సహాయ కార్యక్రమం కింద రూ.4.56 కోట్లు వాహనదారులకు జమైంది. వాహన మిత్ర పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవాడ నుండి శుక్రవారం ప్రారంభించారు. వాహన మిత్ర ఆర్థిక సహాయ కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర టిడ్కో చైర్మన్ జె.ప్రసన్న కుమార్, కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో 4564 మందికి రూ.4.56 కోట్లు ఆర్థిక సహాయం అందించినట్టు తెలిపారు. ఇందులో 4059 ఆటో రిక్షాలు, 33 టాక్సీ కాబ్ లు, 245 మోటార్ కాబ్ లు, 103 మాక్సి కాబ్ లు, 124 ఎండియులుఉన్నాయని తెలిపారు. ఈ పథకం కింద ప్రభుత్వం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ మరమ్మతులు, ఇతర అవసరాలకు సంబంధించిన ఖర్చుల కోసం స్వీయ-యాజమాన్యమైన ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్, యండియులకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి సి మల్లిఖార్జున రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, వాహనమిత్ర లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

బొత్తిలిలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఏగులవాడ పంచాయతీ బొత్తిలి అంగన్వాడి కేంద్రంలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రజ్జిలి పోలింగ్ స్టేషన్ పరిధిలో గల కొండల మధ్య ఉన్న సెంటర్ గూడ, కొండరగూడ, బొత్తిలి గ్రామాల్లో సుమారు 200 ఓటర్లు ఉన్నారని, వీరు రజ్జిలి పోలింగ్ స్టేషన్కు రావాలంటే మొండెంఖల్ మీదుగా 30 కిలోమీటర్లు రావాల్సి వస్తోందన్నారు. కేవలం మూడు గ్రామాల నుండి 20శాతం ఓటర్లు మాత్రమే వస్తున్నారని, కావున పోలింగ్ స్టేషన్ బొత్తిలిలో ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఆర్డిఒకు వినతి పత్రం ఇచ్చామని, స్థానిక తహశీల్దార్ కూడా స్పందించి పోలింగ్ స్టేషన్ ఏర్పాటు ప్రక్రియను చేపట్టాలని కోరారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

బోయ, వాల్మీకులను ఎస్టిలో చేర్చొద్దు

ప్రజాశక్తి - సాలూరురూరల్

బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే నిజమైన గిరిజనులకు తీవ్రమైన నష్టం చేకూరుతుందని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని బొర్రపణుకు, తుపాయివలస, బొడ్డపాడులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్టిల జాబితాలో చేర్చాలని ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి శాసనసభలో ప్రకటించి తీర్మానం చేయించారని ఎంతో అభివృద్ధి ముందు వరుసలో ఉన్న ఈ జాతులను అభివృద్ధి అంటే ఏమిటో తెలియని అమాయక గిరిజనులకు అన్ని విధాలా ఇంకా వెనకబడిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో ముందుండి బిసి జాబితాలో ఉన్న ఈ జాతులను ఎస్టి జాబితాలో చేర్చాలని అనుకోవడం కేవలం ప్రభుత్వం ఓట్ల కోసమేనని, గిరిజనుల సంపదను కారుచౌకగా దోచుకోవడానికేనని, ప్రభుత్వం ఇంకా మొండిగా ముందుకు పోయినట్లైతే గిరిజనులను సమీకరించి పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సాలూరు మండల కార్యదర్శి వంతల సుందరరావు, గెమ్మెల బాలయ్య, గాసి పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ ఫీజు గడువు పెంపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్లో చేరేందుకు రుసుము చెల్లించేందుకు గడువు పెంచినట్టు మండల సార్వత్రిక విద్యాపీఠం సమన్వయకర్త పెదిరెడ్ల శ్రీనివాసరావునాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీసాయినికేతన్ హైస్కూల్లో మాట్లాడారు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియట్లో చేరేందుకు అపరాధ రుసుంతో ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం గడువు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. వ్యాపార రంగాల్లో ఉన్నవారికి ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు వివిధ సంఘాల సభ్యులకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. సమావేశంలో శ్రీ సాయి నికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ పక్కి సదాశివరావు (సదామాస్టారు), ఉపాధ్యాయులు ఇజ్జురోతు తాతినాయుడు, చందక అప్పలనాయుడు ఉన్నారు.

కెజిబివి సందర్శన

ప్రజాశక్తి - భామిని

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా సిలబస్ ఎంత మేరకు పూర్తి అయ్యింది, నోట్ పుస్తకాలు పూర్తి స్థాయిలో విద్యార్థుల రాస్తున్నారా అనే అంశాలు పరిశీలించారు. విద్యార్థినిలను పాఠ్యాంశానికి సంబంధిత ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థినులు మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన విద్య, పాఠ్యంశాలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని, పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి మంచి మార్కులు సంపాదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ భాస్కరరావు, కెజిబివి ఎస్ఒ శారద ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు వృత్యాంతర శిక్షణ భాగంగా శుక్రవారం హిందీ సబ్జెక్టుపై డిఆర్పీలు శిక్షణ ఇచ్చారు. హిందీ సబ్జెక్టుపై మెలకువలు విద్యార్థులకు సులభ పద్ధతిలో ఎలా బోధించాలో తెలిపారు. డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీ రాణి పర్యవేక్షించారు. ఈ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగ చేసుకొని విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ కోటిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి -సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మన్యం జిల్లా వాలీబాల్ టీంల ఎంపిక శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డిఇఒ ఎం.ప్రేమ్కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే నైపుణ్యం తెలుసుకొనేందుకు శారీరధారుఢ్యం పెంచేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇందులో విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే చదువులోనూ ఆ నైపుణ్యత ఉంటుందన్నారు. ఈ వాలీబాల్ సెలక్షన్ కోసం 15 టీముల్లో 200 పదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. కొన్ని టీములను జిల్లా స్థాయి వాలీబాల్ కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇ.ప్రసన్నలక్ష్మి, ఎంఇఒ జి.సూర్యదేముడు, పిఇటిలు శ్రీనివాసరావు, గాంధీ, పలు పాఠశాలకు చెందిన పిఇటిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కనబరచాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరు ఆసక్తి కనబరచాలని, ఎరువుల్లేని పంటతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ భూషణ అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని కొండవీధిలో ప్రకృతి వ్యవసాయ పంటలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల ద్వారా పండించే పంటలు ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. దీనివల్ల గ్యాస్టిక్, కేన్సర్, బిపి, షుగర్ తదితర వ్యాధుల బారిన పడుతున్నామని అన్నారు. చిరుధాన్యాలు సాములు, కొర్రలు రాగులు, ఊదలు జొన్నలు, పప్పు దినుసులు పంటలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి బి.గౌరీశంకరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ దివ్య రైతులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వీరఘట్టం

శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం జిల్లాస్థాయి క్రీడ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర)కు చెందిన 9తరగతి విద్యార్థులు ఎం.పవన్తేజ అండర్ -17 విభాగంలో మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. పి.సంజన అండర్-17 విభాగంలో 1500 మీటర్ల పరుగు పందెంలో జిల్లాస్థాయి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్.సంబోర శుక్రవారం తెలిపారు. నవంబర్లోనే పలన్నాడులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వర రావు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జెకెసి వినతుల పరిష్కారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోండి

ప్రజాశక్తి - పాలకొండ

ప్రజల నుండి వచ్చిన జగనన్నకు చెబుదాం వినతులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు అర్జీదారుల నుంచి జెసితో పాటు ఆర్డిఒ కె.హేమలత వినతులను స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 55 వినతులు అందాయి. భూ సమస్యలు పరిష్కరించాలని, సామాజిక పింఛన్లు పునరుద్ధరించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు, ఇళ్ల బిల్లులు చెల్లింపులకు అర్జీలను అందజేశారు. అనంతరం జెసి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన వినతులను క్షేత్ర స్థాయిలో చిత్తశుద్ధితో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు అందించేందుకు జిల్లా కేంద్రానికి అర్జీదారులు రావల్సిన పరిస్థితి తలెత్తకుండా మండల స్థాయిలో పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో కొన్ని....

పాలకొండలో కోట దుర్గమ్మ ఆలయం పక్కన ఉన్న పశు వైద్యశాల భవనానికి మరమ్మతులు చేయాలని సి.హెచ్ రాంబాబు దరఖాస్తు అందజేశారు. మండలంలోని వాటపాగుకు చెందిన బి.ఆదిలక్ష్మి తన కుమార్తెకు జగనన్న విద్య దీవెన, వసతి దీవెన అందలేదని వినతిపత్రం సమర్పించారు. ఓని గ్రామానికి చెందిన బి.లచ్చమ్మ తన మెట్టు భూమిని పల్లం భూమిగా రెవెన్యూ రికార్డులో చూపిస్తుందని, ఆ తప్పులను సవరించి తనకు పింఛను ఇప్పించాలని అర్జీ అందజేశారు. మండలంలెపి ఘటలడేప్ప వీధిలో తన ఇంటికి తాకుతూ ప్రమాదభరితంగా విద్యుత్ తీగెలున్నాయని, వాటిని వీధి మధ్యలోకి మార్చాలని ఎం.మన్మధరావు కోరారు. తంపటాపల్లికి చెందిన ఎ.భానుమతి హౌస్ హెూల్డింగ్ మ్యాప్ స్పిట్టింగ్ చేసి వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఎం.జయమ్మ తన ఇద్దరు పిల్లలకు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన డబ్బులు జమ కాలేదని వినతి పత్రం సమర్పించారు. పాలకొండకు చెందిన జి.జ్యోతి, డి.త్రిపురసుందరి తమకు ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. మండలంలోని ఓని గ్రామానికి చెందిన కుప్పులి దాలప్పమ్మ, కె.అన్నపూర్ణ ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులతో పాటు స్థానిక తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఇతరశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న జెసి గోవిందరావు, ఆర్డిఒ హేమలత

ధాన్యం రవాణాకు జిపిఎస్ తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వం సేకరించిన ధాన్యం రవాణా చేసేందుకు వాహనాలకు జిపిఎస్ తప్పనిసరని జిల్లా రవాణా శాఖ అధికారి సి.మల్లిఖార్జునరెడ్డి అన్నారు. ధాన్యం రవాణా చేసేందుకు సంబంధిత రవాణా యాజమాన్యాలతో జిల్లా రవాణా కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ 2023 - 24 సీజనుకు సంబంధించి జిల్లాలో ధాన్యము కొనుగోలు ప్రక్రియ ప్రారంభం అగుచున్న తరుణంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతు కళ్లాల నుంచి లేదా ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశం నుంచి మిల్లుకు వెంటనే తరలిస్తామన్నారు. సొంత వాహనాలు కలిగిన యజమానులు, రైతులు తమ వాహనాలను వినియోగించవచ్చని, ఆ వాహనాలకు జిపిఎస్ పరికరాలను అమర్చుకోవాలని స్పష్టం చేశారు. జిపిఎస్ ఉన్న వాహనదారులు మాత్రమే ధాన్యం రవాణాలో పాల్గొనేందుకు అర్హత పొందుతారని ఆయన పేర్కొన్నారు. జిపిఎస్ పరికరం విలువ రూ.2,800 అన్నారు. వాహన యజమానులు తమ వాహన వివరాలను జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయములో సమర్పించి, వాహన వివరాలను అక్టోబరు 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంవిఐ ఎం.శశికుమార్, రవాణా అసోసియేషన్ అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.

వార్డులో పనులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న వైస్చైర్మన్ గున్నేష్

అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మున్సిపాల్టీలోని అన్ని వార్డుల్లో చేయాల్సిన అభివృద్ధి పనులు తక్షణమే చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్ర వారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్పర్సన్ బోను గౌరిశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అజెండాలో పొందుపర్చిన 5 అంశాలను ఉద్యోగి చదివి వినిపించగా, అధికార కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. 8వ వార్డు టిడిపి కౌన్సిలర్ కోరాడ నారాయణరావు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్కు నిరసనగా సమావేశ మందిరంలో బైఠాయించి నినాదాలు చేస్తూ సమావేశం నుండి వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ వార్డులోనైనా అభివృద్ధి పనులు జరగాల్సి ఉన్నాయని అడుగ్గా, మున్సిపల్ రెండో వైస్ చైర్మన్ ఇండుపూరు గున్నేష్ తమ వార్డులో ఇంతవరకు ఏ ఒక్క అభివృద్ధి పని జరగలేదని పలుమార్లు మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పనులు ప్రారంభించలేదని అన్నారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా 27 వార్డుకు మంజూరైన నిధులను వేరే వార్డులో ఖర్చు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత వార్డులో చేయాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టేబుల్ అజెండాలో జగనన్న గ్రీన్ ఫీల్డ్ కాలనీలో సిసి కాలువలు, అప్రోచ్ రహదారి వేసేందుకు, చర్చి వీధి కూడలి నుండి చివరి వరకు బుడా నిధులతో రూ.50లక్షలతో సిసి రోడ్డును, పాలకొండ రోడ్డు వైపు వెళ్లే అయ్యప్పస్వామి కోవెలకు వెళ్లేందుకు సిసి రోడ్డు వేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్చైర్పర్సన్ కొండపల్లి రుక్మిణి, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పలు వార్డుల కౌన్సిల్ సభ్యులు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పూతికవలస నుండి నెలిగండి పూర్తిగా పాడైందని, దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఈ రోడ్డు పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతి రావు, మండల నాయకులు పి.సలీం, ఎం.వెంకటేష్, ఎం.కాంతారావు డిమాండ్ చేశారు. ఈ రోడ్డు పనులను సాయి బాలాజీ కన్స్ట్రక్షన్ వారు చేశారని, పనులు జరిగేటప్పుడు సంబంధిత అధికారుల పర్యవేక్షణా లోపం వల్ల నాణ్యతతో చేపట్టకపోవడంతో కోట్ల రూపాయల ప్రజా ధనం దుర్వినియోగమైందని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినా ఎలాంటి చర్యలూ లేవని అన్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు రోడ్డును పరిశీలించాలని, జరిగిన నష్టం ఆ గుత్తేదారుతోనే పూరించాలని డిమాండ్ చేశారు. నెల రోజులో ఈ రోడ్డు పనులు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



రాళ్లుతేలిన పూతికవలస-నెలిగండి రోడ్డు

మహాజన సభలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి గణేష్

రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో పనిచేస్తే మార్కెటింగ్

ప్రజాశక్తి - సీతంపేట

రైతు ఉత్పత్తి కంపెనీలో పనిచేస్తే మార్కెటింగ్ వసతి కలుగుతుందని ఐటిడిఎ ఉద్యానశాఖ అధికారి గణేష్ తెలిపారు. సీతంపేటలో నౌగాడ రోడ్లో ఉన్న మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ కార్యాలయంలో ఏడో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో మార్కెటింగ్ చేయాలనే అలాగే పైనాపిల్లో వస్తు విలువ ఆధారిత అభివృద్ధి చేయించాలని తెలిపారు. ఆముదాలవలస కృషిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నీలవేణి మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని, ఇంట్లో పెరటితోటలో ప్రతి ఒక్కరూ కూరగాయలు పెంచాలని సూచించారు. మన్యం సహజ రైతు ఉత్పత్తి కంపెనీ సిఇఒ బి.శంకర్రావు మాట్లాడుతూ ఆర్ట్స్ సంస్థ, నాబార్డ్ సహకా రంతో 2017లో ఈ కంపెనీ ఏర్పాటు చేశామన్నారు. గృహవిజ్ఞా శాస్త్రవేత్త సునీత మాట్లాడుతూ రైతులు పైనాపిల్, బొప్పాయితో విలువ ఆధారిత వస్తువులు తయారు చేయొచ్చన్నారు. అనంతరం వనమిత్ర ఎఫ్పిసి ఐదో వార్షిక సమావేశం నిర్వహించారు. సిఇఒ పద్మ మాట్లాడుతూ భవిష్యత్తు లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, ఉద్యానవన అధికారి జయశ్రీ, మా తోట వన సహజ సిఇవో రవి, ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

పాలకొండలో పిడుగుల వర్షం

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండలో శుక్రవారం సాయంత్రం పిడుగులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు బెంబేలెత్తారు. పట్టణంలో నెయ్యిల వీధిలో కృష్ణ అనే వ్యక్తి ఇంటిమీద పిడుగు పడడంతో ఇంటిలో ఉన్న ఫర్నీచర్ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో కుటుంబ సభ్యులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈయన చాలా కాలంగా స్థానిక మార్కెట్లో టీ దుకాణం నడుపుతూ టీ కొట్టు కృష్ణగా పేరు సంపాదించుకున్నారు.

కారాడవలసలో మొక్కలు నాటిన స్వచ్ఛంద సంస్థ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం పంచాయతీ కారాడవలసకు చెందిన పిచ్చిక స్వామినాయుడు మెమోరియల్ ట్రస్టు వ్యవస్థాపకులు పిచ్చిక సుధాకర్ అద్వర్యంలో శుక్రవారం నర్సిపురం నుండి కారాడ వలస వరకూ రహదారికి ఇరువైపులా 400 మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. సీనియర్ వైసిపి నాయకులు, గ్రామ ఉపసర్పంచి కాపారపు శివున్నాయుడు చేతులు మీదుగా మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలోని వృద్ధ మహిళలకు 100 మందికి చీరలు పంపిణీ కార్యక్రమంలో ట్రస్టు అద్వర్యంలో నిర్వహించారు. గ్రామ అభివృద్ధికోసం చేపట్టిన ఈకార్యక్రమ నిర్వాహకుని ప్రయత్నాన్ని గ్రామస్థులు అభినందించారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని జె.గోపాలపురం, విక్రంపురంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ విజయానంద, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపికి వెన్నుదన్ను దళితులు, వెనుకబడిన తరగతులే

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

గిరిజన, దళిత, వెనుకబడిన వర్గాలే టిడిపి వెన్నుదన్నుగా నిలబడుతు ఒదని, చంద్రబాబును అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడంతో ఆయా వర్గాలు సిఎం వైఎస్ జగన్పై ఆగ్రహంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపడుతున్న రిలే నిరాహారదీక్షల్లో భాగంగా శుక్రవారం మండలంలోని సూడిగాంలో ఆపార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికార మదం తలకెక్కి వైఎస్ జగన్ కక్షసాధింపు చర్యలకు పాల్పతున్నారని, అస్తవ్యస్త పరిపాలనతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. రాబోయే ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వైసిపి ఆచూకీలేనంతగా ప్రజలు ఓడిస్తారన్నారు. ఈ సందర్భంగా బిసిలు తమ వృత్తులతో నిరసన తెలిపారు.కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షులు జి.వెంకటనాయుడు, గర్భాపు ఉదయభాను, గొరజాన చంద్రమౌళి, బోను చంద్రమౌళి, బేతలక్ష్మణరావు, బార్నాల సీతారాం, చుక్క అచ్యుతరావు, యాండ్రాపు చినరామిం నాయుడు, జాగాన రవికుమార్, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న బిసిలు

సీతంపేట: మండల కేంద్రంలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి నిమ్మక జయకృష్ణ తలపెట్టిన బాబుతో నేను రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కొనసాగాయి. ఈ సైకోను ఎలాగైనా గద్దె దించాలని, ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవాలని ఉద్దేశంతో జనసేనతో పొత్తు పెట్టుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, ఎఎంసి చైర్మన్ పాదిలాపు కృష్ణ మూర్తి నాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, పాలకొండ పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్కువ : ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని, ఆయన బయటకు వచ్చాక వైసిపి ప్రభుత్వం తాటతీస్తామని సాలూరు నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసన జనసేన, టిడిపి సంయుక్తంగా నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం సాయిబాబా మందిరం వద్ద చంద్రబాబు విడుదల చేయాలని కోరుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పి భంజ్దేవ్, మండల నాయకులు గుళ్ల వేణు, మావుడి ప్రసాదరావు, జనసేన నాయకులు గేదెల రిసివర్ధన్, పలువురు టిడిపి శ్రేణులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు

హాజరు కాని పెంట వర్గం

మండల కేంద్రంలో జరిగిన టిడిపి నిరాహారదీక్షకు మండల మాజీ అధ్యక్షులు పెంట తిరుపతిరావు, అతని అనుచరులు హాజరు కాలేదు. అయితే మధ్యాహ్నం భంజ్దేవ్ ఈ కార్యక్రమంకు వచ్చి నిరసన శిబిరంలో కూర్చున్నారు. మండలంలో తిరుపతిరావు చెందిన వర్గం పాల్గొక పోవడం గ్రూపు రాజకీయం బహిర్గతమైంది.

వీరఘట్టం: చంద్రబాబు అక్రమ అరెస్టు ఖండిస్తూ శుక్రవారం చంద్రబాబుకు తోడు మేము సైతం వంటి కార్యక్రమాన్ని మండలంలోని దశమంతపురం, నర్సిపురంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పరిచర్ల వెంకటరమణ, తెలుగు యువత మండల అధ్యక్షులు మాచర్ల అనిల్కుమార్, ఎ.కుమారస్వామి, ఎస్ శశి కుమార్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సీతానగరం : ఇంటింటి సర్వేలో భాగంగా వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సీతానగరం, పెద్ద అంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలో పరిధిలో గల అన్ని సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జరిగింది. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఆయా గ్రామాల సచివాలయ పరిధిలో ఉచిత వైద్య క్యాంపుల కోసం వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని ధారపాడు సచివాలయంలో శుక్రవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి, ఎంపిడిఒ కొండపల్లి సత్యం, సర్పంచ్ జి.సుదరమ్మ, కుటుంబ వైద్యుల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వీటిలో 118 రకాల మందులు, ఏడు రకాల వైద్య పరీక్షలు ఉంటాయని, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. దీనిపై సర్వే చేపట్టి గిరిజనులకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో దోనుబాయి వైద్యాధికారి భాను ప్రతాప్, కార్యదర్శులు బి.సుదర్శనరావు, ఎ.అప్పలస్వామి, అన్నపూర్ణ, సర్పంచులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో ఇకెవైసి

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో రైతులకు ఇకెవైసి, పంట నమోదుపై శుక్రవారం మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ అన్ని గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈనెల 30లోగా అన్ని పంటలు ఇ-పంట నమోదు 100శాతం, ఇకెవైసి 70శాతం ఇప్పటి వరకు జరిగిందని 100శాతం ఆదివారంలోగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు విఎఎలు పాల్గొన్నారు

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నా దేశం నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లా వెంకటరావు ,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లేట్లు వితరణ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి గంట దినేష్ కుమార్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం 250 ప్లేట్లు వితరణగా అందజేశారు. దినేష్ కుమార్ ప్రస్తుతం పార్వతీపురం కెనరా బ్యాంక్ మేనేజర్గా విధులు నిర్వహిస్తున్నారు. చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు తోచిన సాయం చేయాలనే ఉద్దేశంతో ప్లేట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలో బాగా చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో బ్యాంకు సిఎస్ఆర్ ప్రోగ్రాం కింద రూ.22500 అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం బిడ్డిక బీముడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థి దినేష్కుమార్

కురుపాంలో ర్యాలీ చేస్తున్న కెజిబివి విద్యార్థినులు

మేరా మట్టి... మేరా దేశ్పై విద్యార్థులు ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

మేరా మట్టి... మేరా దేశ్ కార్యక్రమంపై స్థానిక కెజిబివి విద్యార్థులతో పాఠశాల ప్రత్యేక అధికారిని ఐ.కిరణకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిసిడిఒ కె.రోజారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాద్కి అమృత్ మహెూత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి మోడీజీ పిలుపుమేరకు ఈ కార్యక్రమం పాఠశాలల్లో చేపట్టినట్టు తెలిపారు. దేశానికి స్వాతంత్రం కోసం పోరాడి ఎంతోమంది మహానుభావుల త్యాగఫలం కూడిన ఈ దేశంలో ఈ మట్టి ఎంతో గొప్పదని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం :మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మేరీ మిట్టి మేరీదేశ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ పతాకంతో పాటు వివిధ భారతీయ పితామహుల చిత్రపటాలతో అలరించారు. కార్యక్రమంలో ఎవి రావు, ఎస్.రవికుమార్, ఎ.చంద్రమౌళితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.